క్లుప్తంగా

కోడిపందెం నిర్వాహకులపై కేసు

అమడగూరు: మండలంలోని హరిపురం గ్రామ సమీపంలో కోడి పందేలను నిర్వహిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హరిపురం సమీపంలో కోడిపందేలను నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో వెళ్లి గ్రామ పరిసరాల్లో సోదాలు చేశామన్నారు. పందేలు ఆడుతుండగా 10 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 8 పందెం పుంజులు, రూ. 3 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

పుట్టపర్తి: బుక్కపట్నం మండల పరిధిలోని కృష్ణాపురం వద్ద ఆదివారం పేకాట స్థావరాలపై దాడి చేసి 5 మంది జూదరులను అరెస్టు చేశామని ఎస్‌ఐ నరసింహుడు విలేకరులకు తెలిపారు. పేకాట రాయళ్ల నుంచి రూ. 6,900 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు గంధం

తలుపుల: ఎగువపేటలోని షహమీర్ ఔలియా దర్గాలో మంగళవారం గంధం, బుధవారం ఉరుసు నిర్వహిస్తున్నట్లు ఖాదిమానే షహమీర్ ఔలియా తెలిపారు. కులమతాలకు అతీతంగా కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరారు.

అన్నదానం



బత్తలపల్లి: బత్తలపల్లిలోని లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం 41 రోజులు పాటు నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసేందుకు శివదీక్షా స్వాములు సహకారం అందించాలని ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, యోగానందాచారీ, బిల్లే సూరీ, కోటి అంజి తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సర్పంచుల సంఘం సభ్యులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండల సర్పంచుల సంఘం సభ్యులు సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని స్థానిక పార్టీ కార్యాలయంలో కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నూతన అధ్యక్షుడు కుళ్లాయిరెడ్డి, మండల వైస్ ఎంపీపీ రంగన్న, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, తదితరులు ఉన్నారు.

'పల్లె' చిల్లర రాజకీయాలు మానుకోవాలి

నల్లమాడ: మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలని మండలంలోని యర్రవంకపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ రజనీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం తమ గ్రామంలో పర్యటించిన పల్లె రఘునాథరెడ్డి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేతకాని ఎమ్మెల్యే అంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నీలాగా భుజాల మీద చేతులు వేసి, జేబులు తడిమి చిల్లర రాజకీయాలు చేయడం మా ఎమ్మెల్యేకు చేతకాని మాట వాస్తవమే అన్నారు. మీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు ప్రజల సొమ్మును దోచుకొని జేబులు నింపుకున్నారని ఆరోపించారు. తమ గ్రామంలో ఇప్పటివరకు రూ.25 లక్షలతో సీసీ రోడ్లు వేయించడం, 35 విద్యుత్ స్తంభాలు నాటించి వీధి దీపాలు ఏర్పాటు చేయడం, నాలుగు తాగునీటి బోర్లు మంజూరు చేసి 15 ట్యాంకులు నిర్మించడం ద్వారా తాగునీటి సమస్య లేకుండా చేయడం, 420 పక్కాగృహాలు, 135 పింఛన్లు మంజూరు చేసిన ఘనత ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

పుట్టపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంగిరెడ్డి

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పుట్టపర్తికి చెందిన కత్తి గంగిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులోని న్యాయవాదుల విశ్రాంతి భవనంలో న్యాయవాదులు సమావేశమయ్యారు. బార్ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా తీర్మానించారు. అధ్యక్షుడిగా కత్తి గంగిరెడ్డి, ఉపాధ్యక్షులుగా నిడిమామిడి శ్రీనివాసులు, కార్యదర్శిగా అతావుర్ రెహమాన్, కార్యవర్గ సభ్యులుగా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, యధుభూషన్, ఇందిర, సీనియర్ అడ్వకేట్ వెంకటరమణప్ప, నాగేంద్రలను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. మాజీ అధ్యక్షుడు నాగమల్లేశ్వరరెడ్డి, రాజగోపాల్, చల్లా చంద్రశేఖర్, భారతిరెడ్డి, మహేష్, అరవింద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీగంధం చెట్లు నరికివేత

ఓడీ చెరువు: మండలంలోని కొండకమర్ల గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఫయాజ్‌బాష తోటలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్రీగంధం చెట్లు నరికివేసి ఎత్తుకెళ్లారు. బాధితుడు సోమవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. కొండకమర్ల సమీపంలోని మామిడితోటలో ఆరు శ్రీ గంధం చెట్లు ఉన్నాయి. సుమారు పది ఏళ్ల వయసున్న చెట్లలో మూడింటిని నరికేసి ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం తోటకు వెళ్లగా చెట్లు నరికివేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఫయాజ్‌బాష చెప్పారు.

అంబరం.. సంక్రాంతి సంబరం



చెన్నకేశవ స్వామి ఆలయంలో తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



గాండ్లపెంట: శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో మోస్తున్న భక్తులు

కొత్తచెరువు: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆది, సోమవారాలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని చెన్నకేశవపురం గ్రామంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారిని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు ఉషారాణి, చెన్నారెడ్డి తో కలసి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ కన్వీనర్ నారేపల్లి జగన్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ముగ్గుల పోటీలు..

ఓడీ చెరువు: నాయనాకోట తండాలో యూత్ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. నాయనకోట, నాయనకోటతండా, వీరప్పగారిపల్లి గ్రామాలకు చెందిన 60 మంది మహిళలు ముగ్గులు వేశారు. వీణాబాయి ప్రథమ బహుమతి కింద రూ. 5,016, రమాబాయి రెండో బహుమతి రూ. 3,016, మేకల కల్పన మూడో బహుమతి రూ. 2,016 గెలుపొందారు. గ్రామపెద్దలు చంద్రనాయక్, రవి నాయక్, గోపాల్‌నాయక్, ప్రసాద్‌నాయక్ అందజేశారు.

పల్లెల్లో సంక్రాంతి వేడుకలు

అమడగూరు: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి వేడుకలను సాంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా నిర్వహించారు. పశువులకు స్నానం చేయించి కొమ్ములకు రంగుల పేపర్లను అంటించి, ఒంటిపై పరదా దుస్తులను వేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఆకట్టుకున్న ముగ్గులు

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలో సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా జరిగాయి. శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో గోపూజను నిర్వహించారు. కొత్తపేట వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీనివాసనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం, దుర్గమ్మ ఆలయం, షిరిడిసాయిబాబా ఆలయం, కన్యకాపరమేశ్వరిదేవి ఆలయాల్లో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీ అన్నమయ్య సేవా మండలి సభ్యులు పొరాళ్ల పుల్లయ్య సమక్షంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ధర్మవరం పట్టణం పట్టుచీరలకు ప్రసిద్ధి కావడంతో కొంతమంది పట్టుచీరల డిజైన్లతో ఇంటి ముందు ముగ్గులను వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ధర్మవరం పట్టణంలో డిజైనర్ నాగరాజు భార్య పట్టు చీర డిజైన్‌ను ఇంటి ముందు రంగులతో ముగ్గును వేసింది. అలాగే పట్టణంలోని దుర్గానగర్‌లో వీణ అనే మహిళ పట్టుచీర అనుకునేలా రంగులతో ముగ్గును వేసింది.

బత్తలపల్లి: మండలంలో పల్లెపండుగను ఆనందోత్సాహాల నడుమ గ్రామీణులు జరుపుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంగమేశ్వర క్షేత్రం, కాటకోటేశ్వర క్షేత్రంతో పాటు పోట్లమర్రి, ముష్టూరు శివాలయాలు, రామాపురం, మాల్యవంతంలోని వీరనారాయణస్వామి, బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుడు, లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో, దంపెట్ల చెన్నకేశవాలయం, డి.చెర్లోపల్లి సిద్దేశ్వరాలయం, గంటాపురం అప్పస్వామి దేవాలయాల్లో మహిళలు తరలివచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బత్తలపల్లిలో ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, లింగారెడ్డిపల్లిలో చౌడేశ్వరి అమ్మవారికి ఎంపీపీ గుర్రం వనజ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని హరహర గణేష్ దేవాలయంలో సోమవారం శివునికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, కుంకుమార్చన, జలాభిషేకం తదితర వాటిని అర్చకులు రఘునాథశాస్త్రి, భరత్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారిని మహంకాళేశ్వర అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బీడుమర్రి కొట్టాల గ్రామంలో గోమాతలకు, ఎద్దులకు ప్రత్యేక పూజలు చేశారు.

ఊరూరా సంబరాలు

కనగానపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆది, సోమవారాల్లో ప్రజలు సంతోషంగా సంక్రాంతి పండుగ సంబరాలు జరుపుకున్నారు. రైతులు పండించిన పంట ధాన్యాలతో పిండి వంటలు చేసుకొని ఆరగించారు. మహిళలు ఇళ్ల ముందు అందమైన రంగవల్లు వేసి వాటిపై గొబ్బెమ్మలు పెట్టి పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో యువకులు, పిల్లలు గాలి పటాలు ఎగురవేయటం, ఆటల పాటలతో సంతోషంగా గడిపారు.

గాండ్లపెంట: మండల పరిధిలోని వేపరాల పంచాయతీ బోయపల్లిలో వెలసిన తిరుమలదేవుని ఆలయంలో ఆదివారం రాత్రి సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో మోస్తూ గుడి చుట్టూ ప్రదక్షిణ చేయించారు. భక్తాదులకు అన్నదానం చేశారు.

ఘనంగా పులి పార్వేట

నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం పులి పార్వేటను ఘనంగా నిర్వహించారు. కుందేలును వదిలి తిరిగి దాన్ని పట్టుకోడానికి యువకులు, భక్తులు ఉత్సాహంతో పాల్గొన్నారు. వేడుకను తిలకించడానికి తనకల్లు, కదిరి, గాండ్లపెంట, ఎన్‌పీ కుంట, తలుపులతో పాటు పులివెందుల, కర్ణాటకలోని చాకీవేలు, చేలూరు, బాగేపల్లి తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తాదులు విచ్చేశారు. పులి పార్వేటలో భక్తులు చేసిన చెక్క భజన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తొలుత ఆలయంలోని ఉత్సవ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.



ధర్మవరంలో ఓ ఇంటి ముందు వేసిన పట్టుచీర డిజైన్ ముగ్గు

అట్టహాసంగా ఉట్ల పరష



నల్లమాడ: దొన్నికోట గ్రామంలో ఉట్ల పరష, పార్వేట ఉత్సవాలు సోమవారం అట్టహాసంగా జరిగాయి. ఉట్లమాను ఎక్కేందుకు, పార్వేట ఉత్సవంలో కుందేలును పట్టుకునేందుకు యువకులు పోటీ పడ్డారు. చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు జనం పెద్ద సంఖ్యలో వేడుకలను తిలకించారు. ముందుగా గ్రామపెద్దల ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహ స్వామి చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించారు. ముందుజాగ్రత్త చర్యగా గ్రామంలో పోలీస్ బందోబస్తు చేపట్టారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, మాజీ మండల కన్వీనర్ పొరకల రామాంజనేయులు హాజరయ్యారు. స్థానిక నాయకులు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఎం.నరసింహులు, సర్పంచ్ రాగినేని సరస్వతి, వైస్ ఎంపీపీ యనమల ఉత్తమ్మ, పాల ఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కుళ్లాయమ్మ, మండల కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రసూల్, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల ఉత్సవాలకు సర్వం సిద్ధం



కలశం తీసుకొస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలో చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తొగటవీర క్షత్రీయ కుల గురువు దివ్యజ్ఞానానందగిరిస్వామి సోమవారం రాత్రి అగ్నిగుండం వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు తలపై చౌడేశ్వరిదేవి జ్యోతులు పెట్టుకుని నృత్యం చేస్తూ అమ్మవారి పాటలు పాడుతూ దుర్గమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో ప్రవేశం చేసి ఉత్సవాలను ముగిస్తారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, తొగటవీర క్షత్రీయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

గాండ్లపెంట: రాష్ట్ర ప్రభుత్వం విశ్వకవి యోగి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కటారుపల్లి వేమన సమాధి వద్ద ఆదివారం జీఓ ప్రతులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గుంటూరు శ్రీబాలభారతి (బాలసేవా సంస్థ), కొండవీడు హెరిటేజ్ సొసైటీ వ్యవస్థాపకులు యర్రం సాంబిరెడ్డి, కల్లిశివారెడ్డి మాట్లాడుతూ మంత్రి పెద్దరెడ్డి రామచంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జనవరి 19న గుంటూరులో వేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. బెస్త సేవా సంస్థ తరపున సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బెస్తసేవా సంస్థ సభ్యులు రామక్రిష్ణ, భాస్కర్, నాగేంద్ర, నాగరాజు, లక్ష్మీనారాయణ, జనార్ధన్, గంగాధర్, ఆలంబన సంస్థ సభ్యులు బెస్త జనార్ధన్ పాల్గొన్నారు.



వేమన సమాధి వద్ద జీఓ ప్రతులకు పూజలు చేస్తున్న బెస్తసంఘం నాయకులు

సేవాభావం చాటుకున్న 'బత్తల'

కదిరి అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ సేవాభావం చాటుకున్నారు. కదిరి మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలోని ఎస్సీ కాలనీలో చర్చి కమిటీ భవన నిర్మాణానికి సోమవారం ఆయన రూ. 4 లక్షల విరాళాన్ని ప్రకటించారు. అలాగే, మార్చిలో నిర్వహించే ఇస్తేమా నిర్వహణకు తన సొంత స్థలాన్ని వినియోగించుకునేందుకు అనుమతించారు.

- కదిరి పట్టణంలోని మక్కా మసీదు ముతవల్లీ నిజాం ఆహ్వానం మేరకు మసీదును బత్తల హరిప్రసాద్ సందర్శించారు. మసీదులో గ్రానైట్ బండలు, పీఓపీ పనులకు ఆర్థికసాయం చేయాలని మత పెద్దలు కోరగా వెంటనే స్పందించి ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హరిప్రసాద్‌ను మత పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు కేఎస్ బాహుద్దీన్, మాజీ సర్పంచ్ బత్తల వెంకట రమణ, సీనియర్ నాయకులు ఆదినారాయణ,14వ వార్డు కౌన్సిలర్ మహబూబ్‌బాషా, పట్నం షామీర్ ముబారక్ తదితరులు పాల్గొన్నారు.



బత్తల హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న ముస్లిం మతపెద్దలు

ఆర్థిక సాయం అందజేత

ఎన్‌పీకుంట: మండల కేంద్రానికి చెందిన అనారోగ్య బాధితులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆర్థిక సాయం అందించారు. మండల కేంద్రంలోని ఇందిరా కాలనీకి చెందిన ఆంజినేయులు, ఈశ్వరమ్మలు పెరాలసిస్‌తో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న నాయకులు ఆదివారం బాధితుల ఇంటికి చేరుకొని వారిని పరామర్శించారు. ఆంజినేయులుకు రూ.20 వేలు, ఈశ్వరమ్మకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, వార్డు మెంబర్లు జ్యోతి, ఆనంద్, బత్తల యువసైన్యం నాయకులు పాల్గొన్నారు.

18 నుంచి సీఐటీయూ మహాసభలు

పుట్టపర్తి టౌన్: సీఐటీయూ 17వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈయస్ వెంకటేసులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 22 వరకు బెంగుళూరులో మహాసభలు జరుగుతాయన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై తీర్మానాలు చేస్తారన్నారు. 22న భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. ప్రధాని మోదీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించడానికి కార్మికుల పక్షాన పోరాటాలు చేయడంపై మహాసభల్లో చర్చిస్తారన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కోశాధికారి సాంబశివ, నాయకులు లక్ష్మీనారాయణ, గౌస్‌లాజమ్, బాబావలి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ధర్మవరం అర్బన్: ఉద్యోగులు క్రీడలు కూడా ఆడితే ఒత్తిడి దూరమై మానసిక ఉల్లాసం లభిస్తుందని మండల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డె బాలాజి, ప్రైవేటు డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ సీతారామయ్య, చేనేత వ్యాపారులు నిమ్మ చంద్ర, కిరణ్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ మైదానంలో జరుగుతున్న షటిల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్స్‌లో మొదటి మ్యాచ్ అలి, రమేష్ జట్టుతో రహమాన్, నిఖిల్ జట్టు తలపడగా అలి, రమేష్ జట్టు గెలుపొందారు. రెండో మ్యాచ్‌లో లోకేష్, చైతన్య జట్టుతో కృష్ణమోహన్, లింగమాచారి జట్టు పోటీపడి ఓడింది. ఫైనల్స్‌లో లోకేష్, చైతన్య జట్టుపై అలి, రమేష్ జట్టు విజయం సాధించింది. విన్నర్స్‌కు రూ.10వేలు, రన్నర్స్‌కు రూ.5 వేలు, మూడో బహుమతి రూ.2 వేలు, నాల్గవ బహుమతి రూ.వెయ్యి నగదు బహుమతితోపాటు మెమెంటోలను అతిథుల చేతుల మీదుగా క్రీడాకారులకు అందించారు. టోర్నీ ఆర్గనైజర్ కృష్ణ ప్రసాద్, అధ్యక్షుడు మధు, కార్యదర్శి రాజ, సహాయ కార్యదర్శి నాగేంద్ర, సభ్యులు అఖిల్, లచ్చి, నారాయణస్వామి, ధను, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహయ్య కుమారుడు హరి గత వారం విద్యుత్ స్తంభం ఎక్కి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. చికిత్సకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చి కొంత మేర ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ నాగమణి, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, కొత్తకోట కేశప్ప, మండల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకటచౌదరి తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

తనకల్లు: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన మద్దిమడుగు వేమన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి మృతుని కుటుంబానికి 10 వేల ఆర్థికసాయాన్ని పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి చేత సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, నాయకులు బీఎస్ నిజాం, తబ్రేజ్, శ్రీనివాసులు, చంద్ర, గొంది లక్ష్మన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రానికి చెందిన మాజీ సింగిల్ విండో డైరెక్టర్ అగ్గేరి గంగప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి మృతుని కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని సర్పంచ్ పంచరత్నమ్మ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథనాయుడు, నాయకులు ఉత్తన్న, రామాంజినేయులు, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

నల్లచెరువు: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దేవరింటిపల్లికి చెందిన జయచంద్రారెడ్డి, సుబ్బమ్మ ద్విచక్ర వాహనంలో తమ సమీప బంధువుల ఇంటికి వెళ్తుండగా తనకల్లు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఇరువురిని చికిత్స కోసం కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిమితికి మించి తరలిస్తే చర్యలు

రామగిరి: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ జనార్ధన్ నాయుడు హెచ్చరించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మండలంలో తరచూ ఆటో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ప్రతి ఆటోకు రేడియం స్టిక్కర్ అతికించుకోవాలన్నారు. ఆటోలకు నంబర్లు కేటాయిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే క్షతగాత్రులను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు ఊరు దేవర

కనగానపల్లి: మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో మంగళవారం పెద్దమ్మ, పోతలయ్య స్వాముల ఊరు దేవర (జాతర) నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సుమారు 60 సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ జాతరలో పాల్గొనేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం చేరుకుంటున్నారు. సోమవారం గ్రామంలోని ఆంజనేయస్వామికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

వెండి త్రిశూలం బహూకరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గమ్మ ఆలయానికి సోమవారం కార్తీక్ దంపతులు రూ.86 వేలు విలువ చేసే వెండి త్రిశూలాన్ని దుర్గమ్మ దేవతకు అందించారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలుపుతూ ప్రత్యేక పూజలు చేయించారు.

ఆర్‌జే రత్నాకర్‌కు సన్మానం

పుట్టపర్తి అర్బన్: సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌ను పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ప్రశాంతినిలయంలోని ట్రస్ట్ కార్యాలయంలో ఆయనకు దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. సత్యసాయి బాబా స్థాపించిన సత్యసాయి పాఠశాలలో ఇటీవల నిర్వహించిన క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ పిల్లలు పాల్గొని పలు విన్యాసాలు చేశారని తెలిపారు. ఉన్నత చదువులు సైతం స్థానికంగానే చదివించనున్నట్లు చెప్పారు. వైస్ ఎంపీపీ హనుమంతరెడ్డి, గంగిరెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు హనుమంతరెడ్డి, తదితరులున్నారు.

నేడు తెప్పోత్సవం

నల్లచెరువు: పంతులచెరువులో మంగళవారం తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రమణారెడ్డి తెలిపారు. సోమవారం తెప్పోత్సవ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ నారాయణస్వామి, తదితరులున్నారు.